
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



'పేట' అడవిలో అలజడి
అశ్వారావుపేట సమీపంలోని గుబ్బలమంగమ్మ ఆలయ అటవీ ప్రాంతంలో తుపాకులతో సంచరిస్తున్న వేటగాళ్లు అలజడి సృష్టించారు. 8లో



జల వనరుల వృద్ధికి చర్యలు
బొగ్గు గనుల పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు సింగరేణి సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
38° / 25°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

12న పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాధపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించనున్నారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని ఈఓ ఎస్.రజనీకుమారి సూచించారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత

డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్



అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న డీఎఫ్‌ఓ, సిబ్బంది

కరకగూడెం: అడవుల పరిరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ అన్నారు. మండలంలోని అనంతారం రిజర్వ్ ఫారెస్ట్ ప్లాంటేషన్లను, అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి వనరులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, అడవులను నరకడానికి ప్రయత్నించినా, వన్యప్రాణులను వేటాడినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అటవీ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడవుల సంరక్షణపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు డివిజన్ అటవీ అధికారి సయ్యద్ మక్సుద్ మొయినొద్దీన్, అనంతారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది వెటర్నరీ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

పాల్వంచరూరల్ : జిల్లాలో 12 మంది వెటర్నరీ అసిస్టెంట్లకు లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి లభించిందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. తమ కార్యాలయంలో బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించామని, వెటర్నరీ అసిస్టెంట్లుగా రెండేళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించామని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతి పొందిన 12 మందిలో 8 మందిని జిల్లాలో ఖాళీగా ఉన్న వెటర్నరీ ఆస్పత్రులకు కేటాయించామని, మరో నలుగురు బదిలీపై ఖమ్మం జిల్లాకు వెళ్లారని తెలిపారు.

భక్తులకు మెరుగైన సేవలందించాం

భద్రాచలంటౌన్ : శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మెరుగైన సేవలందించామని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, పర్ణశాల, కొత్తగూడెంలో రెండు రోజుల పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా 14,789 మంది భక్తులు ఈ శిబిరాలను వినియోగించుకున్నారని వివరించారు. ఏఓ బాలాజీ నాయక్, చైతన్య, మధువరన్ ఈ శిబిరాలను పర్యవేక్షించారని పేర్కొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నష్టం అంచనాల్లో అధికారులు



రాజాపురంలో నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అన్నపురెడ్డిపల్లి / చండ్రుగొండ : రెండు మండలాల్లో రెండురోజులపాటు గాలిదుమారంతో కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా రెండు మండలాల్లో అరకొరగా ఉన్న మామిడిపంట గాలిదుమారానికి నేలరాలింది. దీంతో రూ.లక్షల్లో నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. కోతదశలో ఉన్న వరిపంట నేలవాలింది. వర్షం పడటంతో తేమ కారణంగా ధాన్యం రంగుమారుతుందని, కోత కోసే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. చండ్రుగొండ, దామరచర్ల, అయన్నపాలెం, మద్దుకూరు, అబ్బుగూడెం, మద్రిగూడెం, రాజాపురం తదితర గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయశాఖాధికారులు పంటనష్టం అంచనా వేస్తున్నారు.

మద్దతు దక్కట్లే..



దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అకాల వర్షాల భయంతో పచ్చి ధాన్యాన్నే అమ్ముతున్న రైతులు

- మొక్కుబడిగా ప్రారంభమైన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- అన్నదాతల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న మిల్లర్లు, వ్యాపారులు

బూర్గంపాడు: జిల్లాలో గత 15 రోజులుగా యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే పంటను విక్రయించేందుకు అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొనుగోలు చేయడం లేదు. దీనికి తోడు ఐదారు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులు, అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అగచాట్లు తప్పడం లేదు. దీంతో కొందరు రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వారు తేమశాతం పట్టింపు లేకుండా పచ్చి వడ్లనే కొనుగోలు చేస్తుండగా ధర తక్కువైనా రైతులు వారికి అమ్మేందుకే మొగ్గు చూపుతున్నారు.

సన్నాలకే రైతుల సై..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది యాసంగిలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సన్నరకం వరి పంటలే సాగు చేశారు. దీనికి ప్రభుత్వం బోనస్ ప్రకటించటంతో ఆ పంటల వైపే ఆసక్తి చూపారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ధాన్యం ఆరబెట్టడం ఇబ్బందిగా మారుతుండగా పచ్చి వడ్లనే అమ్ముకుంటున్నారు. దీంతో వ్యాపారులు సన్న, దొడ్డు రకం అనే తేడా లేకుండా ఒకే ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర సన్నరకాలకు క్వింటా రూ.2,320తో పాటు రూ.500 బోనస్, దొడ్డు రకాలకు రూ.2,300 ప్రకటించగా వ్యాపారులు మాత్రం రూ.1,800 నుంచి రూ.1,900 వరకే కొనుగోలు చేస్తున్నారు.

90 వేల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో జిల్లాలో సుమారు 90 వేల ఎకరాలలో వరి సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో కొన్ని చోట్ల పంటలు ఎండిపోయాయి. కొందరు రైతులు కొత్త బోర్లు వేసి పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేశారు. అయితే ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటి వరి దిగుబడిపై ప్రభావం చూపింది. సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తామని ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. దీంతో సన్నరకం ధాన్యాన్ని అమ్మే విషయంలో కొందరు రైతులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు, మిల్లర్లకు అమ్మితే క్వింటాకు రూ. 800 నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే తేమ శాతం సాకుతో కొర్రీలు పెడుతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలతో కొందరు రైతులు తక్కువ ధరలకే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వారు బస్తా (75 కిలోలు) పచ్చి వడ్లను రూ.1,300 నుంచి రూ.1,400 వరకు కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఇక దొడ్డురకాలకు ప్రభుత్వ బోనస్ లేకపోవడంతో ఆ ధాన్యాన్ని పండించిన రైతులు ప్రైవేట్ వైపే మొగ్గు చూపుతున్నారు. పచ్చి వడ్లు అమ్మడంతో తూకం కొంత ఎక్కువ రావడం, ధాన్యం ఆరబెట్టేందుకు పరదాలు, టార్పాలిన్లు, కూలీల ఖర్చు తగ్గడం, ఆరబెట్టిన ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే కాంటా ఖర్చు క్వింటాకు రూ.100 నుంచి రూ. 120 వరకు రైతులే చెల్లించాల్సి రావడంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం



బూర్గంపాడు మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బూర్గంపాడు మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. బూర్గంపాడు మార్కెట్‌కు రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యం కూడా కొంతమేర తడిసింది. మరోవైపు ఈ వర్షాలు వరికోతలకు ప్రతిబంధకంగా మారాయి. ధాన్యంలో తేమ శాతం ఉందంటూ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు పగలు ధాన్యం ఆరబోస్తూ సాయంత్రానికి కుప్పలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను, ఇబ్బందులను గుర్తించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

వైభవం.. జలవిహారం

- శ్రీ సీతారాముల వారికి గోదావరిలో తెప్పోత్సవం
- కొనసాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు



జలవిహారంలో సీతారాములు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారాముల వారు బుధవారం గోదావరిలో జలవిహారం చేయగా.. ఈ వేడుక అద్భుతంగా సాగింది. తొలుత స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా గోదావరి వద్దకు తీసుకొచ్చారు. అలంకరించిన పడవలో స్వామి వారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ రమాదేవి గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించాక స్వామి వారికి జలవిహారం గావించారు. రాత్రికి దొంగల దోపు ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు. ఈ వేడుకలో ఆలయ సిబ్బంది వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి వారికి అశ్వవాహన సేవ నిర్వహించారు. కాగా, తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఊంజల్ సేవ జరపనున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన అదనపు కలెక్టర్, డీపీఓ

చుంచుపల్లి: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం ఐడీఓసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, పేదరిక నిర్మూలన, పౌష్టికాహారం, సుస్థిర వ్యవసాయం, నీటి యాజమాన్య పద్ధతుల వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందులో 30 శాతం నిధులు తాగునీటి పైప్‌లైన్ సౌకర్యం లేని ప్రాంతాలకు, మరో 30 శాతం నిధులు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, గృహ ఇంకుడు గుంతలు, నాడెపు కంపోస్ట్ పిట్‌లకు కేటాయించాలని అన్నారు. సబ్‌కా యోజన–సబ్‌కా వికాస్ పథకం ద్వారా 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పనుల ఎంపికలో విధి విధానాలు పాటించాలని, నిధుల దుర్వినియోగం జరగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన, జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి, డీపీఓ వి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టికలు ప్రదర్శించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని, ల్యాబ్ పరీక్షలకు డీఆర్‌ఏ నిర్ణయించిన ధరలనే తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన డీఆర్‌ఏ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సమస్యలు, వాటి పనితీరుపై చర్చించారు. ఆస్పత్రుల ముందు భాగంలో అంబులెన్స్‌లు తిరగడానికి, పార్కింగ్‌కు స్థలం ఉండాలని సూచించారు. అనుమతి లేని ఆస్పత్రులతో పాటు అర్హతలేని వారు చికిత్సలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ కృష్ణప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మధువరన్, ఏఓ డాక్టర్ బాలాజీ, ఫైజ్ మొహినుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు
- ఐటీడీఏ పీఓ రాహుల్




ఆస్పత్రిలో చికిత్సపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

మణుగూరు రూరల్/అశ్వాపురం : ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు సబ్ డివిజన్ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వైద్య సిబ్బందికి సూచించారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని, అశ్వాపురం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పేషెంట్లకు అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది పని తీరు, భోజన సౌకర్యంపై సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా, భోజనం ఎలా ఉంది అని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యాధితో వచ్చిన వారు పూర్తిగా కోలుకునే వరకు ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా ఉత్తమ సేవలు అందించాలన్నారు. సకాలంలో విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్య తప్పదని హెచ్చరించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని రకాల మందులతో పాటు వేసవికాలం దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం అశ్వాపురం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. కొత్త ఓటరు నమోదు, చేర్పులు, మార్పుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం దరఖాస్తులను పరిశీలించారు. ఈనెల 14వరకు గడువు ఉన్నందున ఎక్కువ మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేలా ప్రచారం కల్పించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని పీఓ దృష్టికి తేగా.. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మణుగూరు ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ గౌరీప్రసాద్, అశ్వాపురం, మణుగూరు తహసీల్దార్లు స్వర్ణలత, రాఘవరెడ్డి, మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఏడీఎంహెచ్‌ఓ చైతన్య, యూడీసీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న 'దుమ్ముగూడెం' నీటిమట్టం

అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుతోంది. ఎగువ నుంచి నీరు రాకపోవడంతో గోదావరి వట్టిపోతోంది. ఆనకట్ట సమీపంలో మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్, భారజల కర్మాగారం ఇన్‌టేక్ వెల్ ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. భారజల కర్మాగారానికి ఇన్‌టేక్‌వెల్ ద్వారా నీరు సేకరిస్తారు. ప్రస్తుతం ఉన్న నీటి మట్టంతో ఈ నెలాఖరు వరకు నీటి సమస్య ఉండదని, వచ్చే నెలలో నీటి సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. –అశ్వాపురం



దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తగ్గుతున్న గోదావరి

మూడింటికీ ఒక్కరే !

- పాల్వంచ మున్సిపల్ కమిషనరే కొత్తగూడెం, అశ్వారావుపేటకు ఇన్‌చార్జ్
- కీలక నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో ఎ' గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడేనికి, ఇటీవలే అప్‌గ్రేడ్ అయిన అశ్వారావుపేట మున్సిపాలిటీకి పర్మనెంట్ కమిషనర్లు లేరు. పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత ప్రస్తుతం ఆ రెండు పట్టణాలకూ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు. దీంతో ఆమె ఎక్కడా పూర్తి సమయం కేటాయించలేకపోతున్నారు. అనేక పనులు పెండింగ్ పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి గత నెలలో తన మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. దీంతో పాల్వంచ కమిషనర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గ్రామ పంచాయతీగా ఉన్న అశ్వారావుపేట ఇటీవలే మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కాగా, అక్కడా సుజాతే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీల్లో విధులు నిర్వహించడం ఆమెకూ కష్టంగానే మారిందనే ప్రచారం జరుగుతోంది. ఇక ఆమె ఎప్పుడు వస్తారు.. ఎప్పుడు వెళ్తారనే విషయాలపై కింది స్థాయి అధికారులకు స్పష్టత లేక సమన్వయం కొరవడుతోంది. దీంతో కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ అవసరాల కోసం వస్తున్న ప్రజలు సిబ్బంది లేక వెనుదిరగాల్సి వస్తోంది. ఇదిలాగే కొనసాగితే మున్సిపాలిటీ పాలన గాడి తప్పే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పనుల్లో జాప్యంతో ఇక్కట్లు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగాన్ని పరిశీలిస్తే మ్యుటేషన్ ఫైళ్లు కుప్పలుతెప్పలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇళ్లు కొనుగోలు చేసిన వారు తమ పేర్లపై మారకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా ఇంటి నంబర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు నెలల తరబడి మున్సిపాలిటీ చుట్టూ తిరుగాల్సి వస్తోంది. కమిషనర్ లేకపోవడంతో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, వచ్చిన వారు సైతం అంతంతగానే పనులు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నెల వరకు ఇంటి పన్నుల వసూళ్లు 80 శాతం దాటలేదంటే సిబ్బంది నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఇష్టానుసారంగా టెండర్లు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో డీఎంఎఫ్ నిధులతో వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఎంపవర్‌మెంట్ సెంటర్ల నిర్మాణం కోసం రెండు నెలల క్రితం ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. దీంతో కొత్తగూడెం, పాల్వంచ నుంచి దాదాపు 40 మంది కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. అయితే గత శనివారం సెలవు రోజు అయినప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కిన కొందరు సిబ్బంది.. తమకు అనుకూలమైన వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో టెండర్లు ఓపెన్ చేశారు. పని దినాల్లోనే టెండర్లు ఓపెన్ చేయాల్సి ఉండగా రహస్యంగా సెలవు రోజు ఓపెన్ చేయడంపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇలాంటి ఘటనలు కొత్తగూడెం మున్సిపాలిటీలో అనేకం జరుగుతున్నాయి. జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్‌ను నియమించాల్సిన అవసరం ఉందని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సుజాతను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

65మంది టీచర్లకు మెమోలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలకు విద్యాశాఖ ఉపక్రమించింది. ఈక్రమంలో విధులకు గైర్హాజరైన 65మంది ఉపాధ్యాయులకు బుధవారం మెమోలు జారీ చేసినట్లు ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సోమవారం నుంచి మూల్యాంకనం మొదలైంది. స్పాట్ వాల్యూయేషన్‌కు 650మంది ఉపాధ్యాయులు అవసరమైతే.. తొలిరోజు సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, హిందీ స్కూల్ అసిస్టెంట్లు 78 మంది తక్కువగా వచ్చారు. దీంతో రెండో రోజైన మంగళవారం భద్రాద్రి జిల్లా ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. మొదటి రోజు 80మంది రిపోర్ట్ చేయకపోగా, మంగళవారం కూడా 620 మందే విధులకు హాజరయ్యారు. సోషల్ సబ్జెక్ట్ మూల్యాంకనానికి 30మంది ఉపాధ్యాయులు తక్కువ పడడంతో గురుకులాల ఉపాధ్యాయులను తీసుకోవాలని నిర్ణయించారు. ఇక రెండు రోజులు హాజరుకాని వారికి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వేస్టేషన్‌ను రూ.25.41 కోట్ల నిధులతో అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు త్వరలోనే పూర్తయ్యే అవకాశముంది. విద్యుద్దీకరణ, వెయిటింగ్ రూములు, ఎస్కలేటర్, లిఫ్ట్ ఏర్పాటుచేస్తుండగా.. స్టేషన్ ముఖద్వారం నమూనాను అధికారులు బుధవారం విడుదల చేశారు. భద్రాచలం వెళ్లే భక్తులు ఈ స్టేషన్‌లో దిగాల్సి ఉండగా, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా రూపొందించిన నమూనా ఆకట్టుకుంటోంది. – కొత్తగూడెంఅర్బన్

క్లుప్తంగా

పూర్తిస్థాయి రక్షణ చర్యలు పాటించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు



అధికారులకు సూచనలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: పూర్తిస్థాయి రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆయన జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి కొండాపురం భూగర్భ గనిని సందర్శించారు. బంకర్‌ను, మ్యాన్‌రైడింగ్ సిస్టం ద్వారా గనిని సందర్శించి పరిశీలించారు. జియోలాజికల్ కండీషన్స్, రక్షణ తదితర అంశాలపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యాన్ పవర్, యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, శ్యాంసుందర్, ఆర్.శ్రీనివాస్, వెంకట్రావ్, వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్ మిలాప్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో బుధవారం ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, కేశవరావు, యోహాన్, అబ్దుల్ బాసిత్, అబ్దుల్ సలాం, ఎ.ఉపేందర్‌బాబు, సత్తార్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు

పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు



విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రం

చుంచుపల్లి: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలు, మున్సిపాలిటీల్లో తగిన రక్షణ చర్యలు చేపడుతున్నారు. ప్రయాణికులు, బయటకు వచ్చిన వారు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాగునీటి బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో అన్ని గ్రామాలు, వార్డుల్లోనూ పూర్తిస్థాయిలో చలివేంద్రాలను అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువుతో ఈఎంటీ, ఆశా వర్కర్

టేకులపల్లి: మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డ గ్రామానికి చెందిన మమతకు పురిటినొప్పులు రావడంతో 108లో అంబులెన్స్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. నొప్పులు అధికం కావడంతో మార్గమధ్యలోనే కాన్పు పొందింది. ఈఆర్‌సీపీ డాక్టర్ శివ సలహా మేరకు ఆశా వర్కర్‌తోపాటు ఈఎంటీ పూర్ణచందర్, పైలట్ శ్రీనివాసరావు సేవలందించారు. ఆడ బిడ్డ జన్మించిందని, తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంఈటీ తెలిపారు.

దుక్కిటెద్దు మృతి

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం గ్రామంలో దుక్కిటెద్దు మొక్కజొన్న కంకులు తిని అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ఓ రైతు సీడ్ మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట చేతికి రావడంతో మూడు రోజుల క్రితం రైతు కంకులు విరిచి, అక్కడక్కడా కంకులు విరవకుండా వదిలేశారు. మొక్కజొన్న పొలంలోకి మేత కోసం వెళ్లిన భూక్య తిరుపతయ్య అనే రైతు దుక్కిటెద్దు రెండు రోజులుగా కంకులు తినడంతో అనారోగ్యానికి గురైంది. పశువైద్యాధికారితో చికిత్స అందించినా చనిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. రూ.60 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ఆటో బోల్తా

ముగ్గురు మహిళలకు గాయాలు

పాల్వంచరూరల్: ఆటో బోల్తా పడి ముగ్గురు మహిళలు గాయపడ్డ ఘటన బుధవారం జరిగింది. మండల పరిధిలోని నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మ, అనూష, కనకమ్మలు తునికి కాయలను విక్రయించడం కోసం ఆటోలో పాల్వంచ వస్తున్నారు. ఈ క్రమంలో ఉలవ్వనూరు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

జల వనరుల వృద్ధికి చర్యలు

- సింగరేణి ఆధ్వర్యంలో 'నీటి బిందువు–జలసింధువు' కార్యక్రమం..
- త్వరలో సింగరేణి వ్యాప్తంగా 50 చెరువుల ఏర్పాటుకు ప్రణాళిక
- మూతపడిన ఓసీ సంపులను నీటి వనరులుగా మార్చే యోచన



సింగరేణి మణుగూరు ఏరియాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

సింగరేణి(కొత్తగూడెం): గనుల పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు సింగరేణి సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. రెండు కిలోమీటర్ల పరిధిలో 50 సహజ చెరువులు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. కుంటల్లో నీటి నిల్వకు చర్యలు చేపట్టాలని భావిస్తోంది. భూగర్భ జలాల అభివృద్ధికి సింగరేణి 'నీటి బిందువు–జల సింధువు' నినాదంతో పర్యావరణ హిత కార్యక్రమాన్ని చేపట్టనుంది. మైనింగ్ ప్రాంతంలోనూ, ప్రాంతానికి వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలోనూ సకల జీవరాశులకు, పంటలకు నీరందేలా చెరువులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించింది. ప్రతీ నీటి బొట్టును సద్వినియోగం చేసేందుకు కృషి చేస్తోంది. పంచాయతీల అనుమతులు తీసుకొని చెరువులను అభివృద్ధి చేయనుంది.

నీటి కుంటలుగా ఓసీ సంపులు

మూతపడిన ఓసీ సంపులను నీటి కుంటలుగా మార్చనుంది. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటిశాతం (మట్టాన్ని) పెంచనుంది. తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ టేబుల్ (నీటిఫలకం)ను వృద్ధి చేసేందుకు, భూగర్భ జలాల పెంపుదలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్‌డంప్‌ల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాలను ఇకపై చిన్నపాటి నీటి తటాకాలుగా తీర్చిదిద్దాలని, వీటిని వర్షపు నీటితో/ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి వెలువడే నీటితో నింపాలని భావిస్తోంది.

కార్మికవాడలకు తాగునీరు కూడా..

సింగరేణి భూగర్భ గనుల్లో బొగ్గుతోపాటు వెలువడే నీటిని పైపుల ద్వారా ఫిల్టర్ బెడ్‌లకు పంపించి, శుద్ధి చేసి కార్మిక వాడలకు యాజమాన్యం తాగు నీరు సరఫరా చేస్తోంది. సుమారు 130 ఏళ్లుగా ఇదే విధానం అవలంబిస్తోంది. 2018 నుంచి మాత్రం కొన్ని చోట్ల కాలనీల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తోంది. యాజమాన్యం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో శుద్ధమైన నీరు కార్మికులకు అందనుంది.

జీవావరణ పరిరక్షణకు చర్యలు



సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల వృద్ధికి, ఆ ప్రాంతంలో జీవావరణ పరిరక్షణకు దోహదం చేసే చర్యలు తీసుకుంటాం. పర్యావరణ అనుమతులతో త్వరలో చెరువుల పనులు ప్రారంభిస్తాం. కార్మికులకూ తాగునీటి సమస్య కూడా తీరుతుంది.

–ఎన్.బలరామ్ నాయక్, సింగరేణి సీఎండీ

శుద్ధమైన నీటిని అందించాలి



సింగరేణి వ్యాప్తంగా చెరువులు ఏర్పాటు చేయాలని తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయం. వీలైనంత త్వరలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, కార్మికులకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించాలి. కొత్తగూడెం ఏరియాలో సుమారు6 చెరువులనుఅభివృద్ధి చేయాలి.

–ఎండీ.రజాక్, కార్మిక నాయకుడు

'పేట' అడవిలో అలజడి

- నాటు తుపాకులతో వన్యప్రాణుల వధకు వెళ్లిన వేటగాళ్లు
- తారసపడ్డ బేస్ క్యాంపు సిబ్బందిపై దాడి?
- పెనుగులాటలో నాటు తుపాకీ మిస్‌ఫైర్ ?



వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

అశ్వారావుపేట: తెలంగాణ, ఏపీ సరిహద్దు గుబ్బల మంగమ్మ ఆలయ అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున తుపాకులతో సంచరిస్తున్న వేటగాళ్లు అలజడి సృష్టించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గుబ్బలమంగమ్మ గుడి సమీపంలో ఏపీకి చెందిన ఆరుగురు వ్యక్తులు నాటు తుపాకులతో వన్యప్రాణుల వేటకు వచ్చారు. బేస్‌క్యాంపు సిబ్బంది గమనించడంతో ఇరువర్గాల మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో మిస్‌ఫైర్ చోటుచేసుకుంది. అయితే ఎవరికీ గాయాలు కాలేదు. బేస్‌క్యాంపు సిబ్బందిపై వేటగాళ్లు తుపాకీతో దాడి చేసినట్లు తెలుస్తోంది. కాగా అటవీశాఖ సిబ్బంది ఒక తుపాకీ లాక్కోగా వేటగాళ్లు పరారయ్యారు. తెల్లవారుజాము కావడంతో ఎవరూ దొరకలేదు. బుధవారం ఉదయానికి మిస్‌ఫైర్ ఉదంతం అశ్వారావుపేట ప్రజలకు తెలిసింది. పరారైన వేటగాళ్లు ఏపీ సరిహద్దులోని గోపన్నగూడెం చేరుకున్నారు. పొద్దునే తుపాకులతో కొత్త వ్యక్తులు గ్రామంలో తిరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. కొద్ది రోజులుగా జిల్లా చర్ల సరిహద్దు ఉన్న పొరుగు రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తుపాకులతో వచ్చిన వారు పోలీసులా..? మావోయిస్టులా.? వేగటాళ్లా..? అనే ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది.

మధ్యవర్తిని ఆశ్రయించి పట్టుబడ్డారు?

బేస్‌క్యాంపు సిబ్బంది వద్ద ఉన్న తుపాకీ కోసం వేటగాళ్లు ఆరుగురు గోపన్నగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ఆశ్రయించినట్లు సమాచారం. కొంత నగదు ఇస్తామని, తుపాకీ తెచ్చివ్వాలని కోరినట్లు తెలుస్తోంది. సదరు వ్యక్తి మధ్యవర్తిత్వం వహిస్తూ బేస్‌క్యాంపు సిబ్బందిని సంప్రదించగా.. అటవీశాఖ సిబ్బంది అతన్ని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. మధ్యవర్తి ఇరుక్కుపోవడంతో వేటగాళ్లు దొరికినట్లు తెలుస్తోంది. కాగా ఆరుగురు వేటగాళ్లలో ముగ్గురినే అరెస్ట్ చూపడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై రేంజ్ అధికారి మురళిని వివరణ కోరగా.. ఇద్దరు వ్యక్తులు తుపాకులతో ఉండగా మరో వ్యక్తి మందుగుండు సామగ్రి, నీళ్ల మోస్తున్నాడని, మరో ముగ్గురు వ్యక్తులున్నా వారికి వేటకు సంబంధం లేదని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. రెండు తుపాకులు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వేటతో సంబంధం లేని పొరుగు రాష్ట్రం వ్యక్తులు రాత్రి 2 గంటల సమయంలో వేటగాళ్లతో పాటు అటవీ ప్రాంతంలో ఎందుకు సంచరిస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అటవీశాఖకు చెందిన ఓ క్షేత్రస్థాయి అధికారి అనధికార అనుమతితోనే వేటగాళ్లు వేటకు వెళ్లారని, ఈ విషయం తెలియక బేస్ క్యాంప్ సిబ్బంది పట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకే బేస్‌క్యాంపు సిబ్బందిపై దాడి చేసినా ముగ్గురినే అరెస్ట్ చేసి, మరో ముగ్గురిని వదిలేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్ చేశాం : ఎఫ్ఆర్వో

నాటు తుపాకులతో వన్యప్రాణుల వేటకు వచ్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళి తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎఫ్ఆర్వో కథనం ప్రకారం.. తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో అశ్వారావుపేట రేంజ్ కావడిగుండ్ల సెక్షన్ కంట్లం బీట్ పరిధిలోని అడవిలో కంట్లం బేస్ క్యాంపు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు రెండు నాటు తుపాకులతో తారసపడగా అదుపులోకి తీసుకుని అశ్వారావుపేట రేంజ్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన వారిని విచారించగా ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కామవరం గ్రామానికి చెందిన కారం రవి, కామ మంగరాజు, వంజం నవీన్‌లుగా తేలింది. వన్యప్రాణుల వేటకు వచ్చినట్లు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

రైతులకు ప్రత్యేక బడ్జెట్ తేవాలి

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పాలకులు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయ రంగం దిబ్బతిని సంక్షోభంలో ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి క్వింటాకు రూ.25 వేలు చెల్లించాలి, పత్తికి రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. అనాదిగా పోడుసాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్, జిల్లా నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, నలిగంటి శ్రీనివాస్, నరాటి రమేష్, సపావట్ రవి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జలనరులశాఖ జిల్లా ఇన్‌చార్జి సీఈగా రమేష్

పాల్వంచరూరల్: జలవనరులశాఖ జిల్లా చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి నాలుగు రోజుల క్రితం సెలవుపై అమెరికాకు వెళ్లారు. మే 1 వ తేదీ వరకు సెలవులో కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జీ సీఈగా సూర్యాపేట జిల్లా జలనరులశాఖ సీఈ రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

భారీ వర్షంతో రైతుల ఆందోళన

దుమ్ముగూడెం : మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులతో సుమారు అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. మిర్చి పంటను కల్లాల్లో ఆరబెట్టిన రైతులు, వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న రైతులు ఈ వర్షానికి పూర్తిగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

తేనెటీగల దాడిలో గిరిజనుడికి గాయాలు

పాల్వంచరూరల్: మామిడి కాయలు కోస్తున్న గిరిజనుడిపై తేనెటీగలు దాడి చేశాయి. మండల పరిధిలోని సారెకల్లు గ్రామానికి చెందిన గిరిజనుడు అడమయ్య బుధవారం గ్రామ శివారులోని తోటలో మామిడికాయలు కోసేందుకు వెళ్లాడు. కాయలు కోస్తున్న క్రమంలో తేనెతుట్టెకు తగిలాడు. దీంతో తేనెటీగలు లేచి దాడి చేయగా అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి పాల్వంచలోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

సింగరేణి(కొత్తగూడెం): అమర వీరుల త్యాగాలు స్మరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాష అన్నారు. రుద్రంపూర్‌లో పునర్నిర్మించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యుడు దేవూరి శేషగిరిరావు విగ్రహాన్ని, సీపీఐ రాష్ట్ర నేత బందెల నర్సయ్య విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. తొలుత నేతల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ సింగరేణి ప్రధాన కార్యాలయంలో సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి శేషగిరిరావు నాటి తెల్లదొరల దోపిడీని వ్యతిరేకించి, కార్మిక హక్కుల సాధనకు కృషి చేశారని గుర్తుచేశారు. నాయకులు బి. అయోధ్య, కొరిమి రాజ్‌కుమార్, వాసిరెడ్డి మురళి, గనిగెల్ల వీరస్వామి, తోట రాజు, ముత్యాల విశ్వనాథం, తాటి వెంకటేశ్వర్లు, డి.వెంకన్న, పుల్లారెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, నలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పందెం కోళ్లు మృతి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణం రామవరంలో వీధి కుక్కలు దాడి చేయడంతో పది పందెం కోళ్లు మృతి చెందాయి. బుధవారం తెల్లవారుజామున 6వ వార్డులో నివాసముంటున్న రమేష్ పాసి ఇంట్లో వీధి కుక్కలు కోళ్లపై దాడి చేశాయి. దీంతో పది కోళ్లు మృతి చెందాయి. రామవరం ప్రధాన రహదారిలో ఉన్న మటన్, చికెన్ దుకాణాల వద్దపడేసిన వ్యర్థాలకు అలవాటు పడిన వీధి కుక్కలు.. ఆ వ్యర్థాలు దొరకకపోవడంతో కోళ్లపై దాడి చేసి, చంపి తింటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మనుషులపై కూడా దాడి చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామ శివారులో డబ్బుల విషయంలో ఇరువర్గాలు చర్చించుకుంటున్న క్రమంలో గొడవ తలెత్తిందని ఎస్ఐ.సురేష్ తెలిపారు. ఈ క్రమంలో పాకాల వెంకట్రావు, ఖాజాలు తమపై దాడి చేశారని బాధితులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దాడి ఘటనలో ఆరుగురిపై..

పాల్వంచరూరల్: దాడి ఘటనలో పోలీసులు బుధవారం ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో సెల్‌ఫోన్‌ల్ వాట్సాప్ వీక్షించే క్రమంలో జగన్నాధం రాంబాబు, రవీందర్ మధ్య వాగ్వాదం నెలకొని రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో రాంబాబు, అనిల్, రాములమ్మలపై రవీందర్, శాంతి, దాసరి లక్ష్మి, అశోక్, అబ్రహం, లక్ష్మి కలిసి గత నెల 9న దాడి చేశారు. బాధితుడు రాంబాబు బుధవారం ఫిర్యాదు చేయగా దాడిచేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనదారుడిపై..

పాల్వంచరూరల్: ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మాలోత్ భగవాన్ గత నెల 5న ద్విచక్రవాహనంపై వెళ్లి పెద్దమ్మగుడి వద్ద కొబ్బరికాయ తీసుకుని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి మరో ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న మున్నవన్ శ్రీను ఢీకొట్టాడు. దీంతో భగవాన్ తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యులు క్షతగాత్రుడి కాలును తొలగించారు. బాధితుడి కుమారుడు నరేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీకాంత్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

సంతాప సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అరుణ్



శ్రీకాంత్ అంతిమయాత్రలో పాల్గొన్న వివిధ పార్టీల శ్రేణులు



శ్రీకాంత్ పాడె మోస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ ఔన్నత్యాన్ని చాటుతూ ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మధురైలో జరిగిన సీపీఎం అఖిల భారత మహాసభలకు వెళ్లిన శ్రీకాంత్ గుండెపోటుతో మృతి చెందగా ఆయన అంత్యక్రియలు బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ నివాసంలో జరిగిన సంతాపసభలో అరుణ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో విద్యార్థి ఉద్యమాభివృద్ధికి ఆయన తోడ్పడ్డారని గుర్తుచేశారు. ఆయన కుటుంబం పార్టీ కోసం నిలబడినందున, ఇప్పుడు వారికి పార్టీ చేదోడుగా నిలవాలని సూచించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. శ్రీకాంత్ లాంటి పోరాట యోధుడు దూరం కావడం బాధాకరమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు పనిచేసిన శ్రీకాంత్ సేవలు మరువలేనివని చెప్పారు. అనంతరం అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరుకాగా, ఆయన పాడెను అరుణ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు మోశారు. ఇంకా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఎం.సాయిబాబు, బి.వెంకట్, వై.వెంకటేశ్వరరావు, జూలకంటి రంగారెడ్డి, బాగం హేమంతరావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, ప్రభాకర్, చావా రవి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే, దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ జిల్లా కమిటీ బాధ్యులు షేక్ అబ్దుల్ రెహమాన్, మావిడాల ఝాన్సీ, దామల్ల జయ తదితరులు కూడా శ్రీకాంత్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

థియేటర్ అడ్డాగా ఇసుక వ్యాపారం



అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

ఇల్లెందు: పట్టణంలో మూతపడిన థియేటర్ అడ్డాగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. అటవీ ప్రాంతంలోని వాగులు, వర్రెల నుంచి తరలించి ఇసుక అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. అటవీశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలను మేనేజ్ చేసి వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ట్రాక్టర్ ఇసుకను రూ.12 వేల వరకు విక్రయిస్తున్నారు. కాగా పూసపల్లి–జెండాల వాగు అటవీ ప్రాంతం నుంచి ఓ ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తుండగా తుడుందెబ్బ ఆధ్వర్యంలో అడ్డుకున్నట్లు ఆ సంఘం నాయకులు తాటి మధు, గుమ్మడి రాంకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. నాగారం నుంచి ఇసుక తరలిస్తుండగా వెంగళరావు కాలనీ వద్ద పట్టణ పోలీసులు పట్టుకుని స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



బ్రహ్మచారి(ఫైల్)

బూర్గంపాడు: సారపాక గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సారపాక కండక్టర్స్ కాలనీకి చెందిన బ్రహ్మచారి(60) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అశ్వాపురం మండలం ఎలుకలగూడెం మోటార్‌సైకిల్‌పై వెళ్లి మంగళవారం రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతని కోసం పలుచోట్ల వెతికారు. బుధవారం ఉదయం సారపాక గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తన తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, మృతుని కుమారుడు అశోక్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ: దంపతులకు తీవ్రగాయాలు



కారు ఢీకొని కూలిపోయిన ఆలయ ప్రహరీ

జూలూరుపాడు: బైక్, కారు ఢీకొని దంపతులు గాయపడ్డ సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెం వద్ద ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వెళుతున్న కారు ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కరివారిగూడెం కాలనీకి చెందిన గుగులోత్ కోటియా, లక్ష్మి దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీకి ఢీకొని ఆగిపోయింది. ప్రహరీ కూడా ధ్వంసమైంది. గాయపడ్డ దంపతులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోటియా, లక్ష్మి దంపతులు కొత్తగూడెం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.